బీజేపీ మౌనం అందుకేనా?!

వివాదాస్పద మెయిన్‌హార్ట్‌కు మూసీ రివర్ ప్రాజెక్టు

లక్షన్నర కోట్ల వ్యయం.. నోరుమెదపని కమలదళం
మోదీ డ్రీమ్ ప్రాజెక్టులను మెయిన్‌హార్ట్ కట్టినందుకా?
మూసీకి నిధులిస్తున్న పాండ్యన్.. మోదీ-బాబు మిత్రుడనా?
సోషల్‌మీడియాలో బీజేపీ నేతలను నిలదీస్తున్న నెటిజన్లు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన రేవంత్ ప్రభుత్వం రూ.లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేపడుతామంటూ హడావుడి చేస్తున్నది. ఈ ప్రాజెక్టును వివాదాస్పద చరిత్ర కలిగిన మెయిన్‌హార్ట్ కంపెనీకి కట్టబెట్టింది కూడా. కాంగ్రెస్ ప్రభుత్వ ఏకపక్ష వైఖరిని, మెయిన్‌హార్ట్‌కు మూసీ ప్రాజెక్టును కట్టబెట్టడాన్ని బీఆర్ఎస్ నేతలు తప్పుబడుతున్నారు. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసన చేపడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. బీజేపీ నేతలు మాత్రం ఈ అంశంపై ఇప్పటివరకు ఒక్క మాట కూడా మాట్లాడకపోవటం చర్చనీయాంశమవుతున్నది. మూసీ ప్రాజెక్టుపై, దాన్ని మెయిన్‌హార్ట్ కంపెనీకి అప్పగించడంపై కమలనాథులు నోరుమెదపకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయని నెటిజన్లు సోషల్‌మీడియాలో పలు కామెంట్లు పెడుతున్నారు.

ప్రధాని మోదీ ఏరికోరి..

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు నిధులనిచ్చేందుకు చైనాకు చెందిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ముందుకొచ్చింది. ఈ మేరకు ఆ బ్యాంకు డైరెక్టర్ జనరల్ పాండ్యన్ గత ఫిబ్రవరి 1న సీఎం రేవంత్ రెడ్డికి హామీనిచ్చారు. పాండ్యన్ పూర్తిపేరు డీ జగదీశ పాండ్యన్. తమిళనాడుకు చెందిన మాజీ ఐఏఎస్. దాదాపు 13 ఏండ్లపాటు గుజరాత్‌కు సీఎంగా చేసిన నరేంద్రమోదీ 2014 మేలో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆనందీబెన్‌ను గుజరాత్‌కు సీఎంగా ప్రకటించారు. అయితే, అప్పటికే తన ప్రభుత్వంలో వివిధ కార్పొరేషన్లలో కీలక పాత్ర పోషిస్తూ తనతో కలిసి పనిచేసిన పాండ్యన్‌పై ప్రధాని మోదీకి ఎంతో నమ్మకం. మంచి సాన్నిహిత్యం కూడా. ఈ క్రమంలోనే 2014 నవంబర్ 1న గుజరాత్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బాధ్యతలను పాండ్యన్‌కు అప్పగించారు. అనంతరం పాండ్యన్ వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్‌గా మారారు. మోదీ సన్నిహితుడిగా పేరున్న అదే పాండ్యన్.. మూసీ ప్రాజెక్టుకు నిధులను ఇస్తామంటూ హామీనివ్వడంతోనే బీజేపీ నేతలు ఈ అంశంపై ఏమీ మాట్లాడటంలేదని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

బాబుతోనూ సాన్నిహిత్యం

చంద్రబాబు ప్రభుత్వం అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను అప్పగించిన సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జ్ కంపెనీ సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్‌కు చెందినది. మూసీ ప్రాజెక్టు దక్కించుకొన్న మెయిన్‌హార్ట్‌లో కూడా ఈయనకు ప్రధాన వాటాలు ఉన్నాయి. ఈ ఈశ్వరన్‌కు పాండ్యన్ మంచి మిత్రుడు. ఈ క్రమంలోనే పాండ్యన్‌తో చంద్రబాబుకు కూడా మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. ఇందులో భాగంగానే ఏపీ రాజధాని అమరావతి నగరాభివృద్ధికి కూడా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు అండదండలు ఇస్తామంటూ హామీనిచ్చింది. దీన్ని ధ్రువపరుస్తూ.. గత జూలై 26న ఏపీ సీఎం చంద్రబాబు పాండ్యన్‌తో సమావేశమవ్వడం, అనంతరం అమరావతి అభివృద్ధి గురించి మాట్లాడటం గమనార్హం.

మోదీ డ్రీమ్ ప్రాజెక్టులకు మెయిన్‌హార్ట్ దన్ను

గుజరాత్‌లోని నర్మదా నది ఒడ్డున ప్రపంచంలోనే ఎత్తయిన పటేల్ విగ్రహం (స్టాట్యూ ఆఫ్ యూనిటీ), యూపీలోని గ్రేటర్ నోయిడా-ఆగ్రా మధ్య ఆరు లేన్ల యమున ఎక్స్‌ప్రెస్ వే, అదే యూపీలోని తన నియోజకవర్గం వారణాసిలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వారణాసి ఎక్స్‌ప్రెస్ వే కారిడార్ తన డ్రీమ్ ప్రాజెక్టులంటూ ప్రధాని మోదీ తరుచూ చెప్తూ ఉండేవారు. ఈ ప్రాజెక్టులన్నింటినీ మెయిన్‌హార్ట్ కంపెనీనే చేపట్టడం గమనార్హం. మెయిన్‌హార్ట్‌కు ఈ ప్రాజెక్టులు దక్కడంపై బీజేపీ పెద్దల రాయబారం ఉండొచ్చన్న అనుమానాలూ లేకపోలేదు. మోదీ కలల ప్రాజెక్టులను పూర్తిచేసిన కంపెనీపై విమర్శలు వ్యక్తం చేస్తే, బీజేపీ అధిష్ఠానానికి ఆగ్రహం కలుగుతుందేమోనన్న కారణంతోనే రాష్ట్ర నేతలు మూసీ విషయంలో 'మెయిన్‌హార్ట్'పై నోరుమెదపడం లేదా? అనే అనుమానాలను నెటిజన్లు వ్యక్తం చేస్తున్నారు.

మెయిన్‌హార్ట్ వల్లే లక్షన్నర కోట్లు!

- తొలుత 50 వేల కోట్లుగా ప్రకటించిన సీఎం రేవంత్
- ఫిబ్రవరి 6న సెక్రటేరియట్‌లో మెయిన్‌హార్ట్ బృందం భేటీ
- 3 నెలల తర్వాత లక్షన్నర కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు

ఫిబ్రవరి 6న సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయిన మెయిన్‌హార్ట్ ప్రతినిధులు (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): చంద్రబాబు హయాంలో పురుడుపోసుకున్న మూసీ సుందరీకరణను ఎవరు అడ్డుపడినా పూర్తి చేస్తామని రేవంత్ ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు బాబు తర్వాత వైఎస్.. రోశయ్య.. కిరణ్‌కుమారెడ్డి.. కేసీఆర్ ఇలా ప్రతి సీఎం హయాంలో ఏదో ఒక పేరుతో కొనసాగుతున్నదే. కానీ కేసీఆర్ ప్రభుత్వ ఆనవాళ్లు లేకుండా చేస్తానని ప్రకటించిన రేవంత్.. సీఎం కుర్చీలో కూర్చున్నది మొదలు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును 'గురు'తర బాధ్యతగా భుజానికెత్తుకున్నారు. థేమ్స్ తరహాలో ఈ ప్రాజెక్టును చేపడతామంటూ జనవరి 19న మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీతో కలిసి లండన్‌లోని థేమ్స్‌ను సందర్శించి వచ్చారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల ప్రచారం మొదలు ఇప్పటివరకు వందల సార్లు మూసీ సుందరీకరణ ప్రాజెక్టును జపిస్తూనే ఉన్నారు.

8 నెలల ముందే భేటీ

మూసీ సుందరీకరణ మాస్టర్‌ప్లాన్ రూపొందించే కీలక బాధ్యతను సింగపూర్‌కు చెందిన మెయిన్‌హార్ట్ కన్సార్షియంకు అప్పగిస్తూ ప్రభుత్వం ఈ నెల 4న ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఇందుకు 8 నెలల ముందే ఆ కంపెనీకి చెందిన ప్రతినిధి బృందం సీఎం రేవంత్‌రెడ్డిని సచివాలయంలో కలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 6న సచివాలయంలో కంపెనీ ప్రతినిధులు కలిసి.. కంపెనీ గతంలో చేపట్టిన పలు రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల వివరాలను ప్రజెంటేషన్ రూపంలో తెలియజేశారు. అయితే మూసీకి సంబంధించి కూడా ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం అప్పట్లోనే వారికి సూచించారు. మార్చి 10న భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో.. మూసీ సుందరీకరణకు రూ.50 వేల కోట్ల ఖర్చవుతుందని రేవంత్ ప్రకటించారు. ఆ తర్వాత పలుమార్లు కూడా అదే ప్రకటన చేశారు. మే చివర్లో మెయిన్‌హార్ట్ కంపెనీ.. మూసీ సుందరీకరణపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సుందరీకరణ ఎలా చేయాలి? ఏయే పనులు చేపట్టాలి? అందుకు ఎంత వ్యయం అవుతుందనే ప్రతిపాదనలు అందులో సమర్పించినట్టు తెలిసింది. అందులోనే మూసీ సుందరీకరణకు రూ.లక్షన్నర కోట్లు ఖర్చవుతుందని పొందుపరిచినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అప్పటినుంచి నెమ్మదిగా ప్రభుత్వ పెద్దల నోటి నుంచి మూసీ సుందరీకరణ అంచనా వ్యయం పెరుగుతూ వచ్చింది. జూన్ 14న ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.71 వేల కోట్లుగా ప్రకటించారు. జూలై 4న గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో మూసీ అంచనా వ్యయాన్ని రూ.లక్షన్నర కోట్లుగా వెల్లడించారు. అంటే.. డీపీఆర్ తయారు కాకముందే అంచనా వ్యయం మూడు రెట్లు పెరగడం వెనక అసలు మతలబు 'మెయిన్‌హార్ట్' ప్రతిపాదనలు అనేది స్పష్టం అవుతున్నది.

అవినీతిలో రాటుదేలిన సింగపూర్ కన్సార్షియం

సింగపూర్ మాజీ మంత్రి, ప్రస్తుతం అవినీతి కేసుల్లో జైలులో ఉన్న ఈశ్వరన్ మెయిన్‌హార్ట్ కంపెనీలో ప్రధాన భాగస్వామి. ఈశ్వరన్‌కు చెందిన మరో కంపెనీ సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జి (మెయిన్‌హార్ట్ అనుబంధ సంస్థ)కే అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను గతంలో చంద్రబాబు ప్రభుత్వం అప్పగించింది. ఈ సంస్థలో ప్రధాన పెట్టుబడిదారు, డైరెక్టర్ ఈశ్వరన్. అమరావతి రాజధాని గ్రాఫిక్స్ మాయాజాలం ఏపాటిదో.. ఇటీవల వరదలతో తేలిపోయింది. తొలుత రాజధాని అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అంటూ రంగప్రవేశం చేసిన ఈశ్వరన్ సింగపూర్ కన్సార్షియం.. ఆపై అవినీతికి దారులు వెతికింది. అప్పటి ఏపీ ప్రభుత్వ పెద్దలతో కలిసి కృష్ణా నదీతీరాన ఏకంగా రూ.66 వేల కోట్ల దోపిడీకి ఈశ్వరన్ స్కెచ్ వేశారనే ఆరోపణలు ఉన్నాయి. స్విస్ చాలెంజ్ విధానంలో అమరావతి స్టార్టప్ ఏరియా ప్రాజెక్టును చంద్రబాబు ప్రభుత్వం ఏకపక్షంగా అసెండర్స్ కన్సార్షియంకు అప్పగించగా.. 1,691 ఎకరాలతో పాటు రూ.5,500 కోట్లు పెట్టే ఏపీ సర్కారుకు 42 శాతం వాటా, కేవలం పర్యవేక్షణ చేసే అసెండర్స్‌కు 58 శాతం వాటా దక్కేలా ఒప్పందం జరిగిందని మీడియాలో కథనాలు వచ్చాయి. సింగపూర్ బయట అవినీతి తీరు ఇలా ఉంటే.. ప్రపంచంలోనే అవినీతిరహిత దేశాల్లో ఐదో స్థానంలో నిలిచిన సింగపూర్‌లోనూ ఈశ్వరన్ అవినీతి చక్రవర్తిగా విరాజిల్లారు.

'మూసీ' సంధాన కర్త జైలుకు!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు టెండర్ వివాదాస్పద మెయిన్‌హార్ట్ కంపెనీకి దక్కింది. ఈ డీల్ వెనుక కీలక పాత్ర పోషించినట్టు భావిస్తున్న భారత సంతతికి చెందిన సింగపూర్ మాజీ రవాణా శాఖ మంత్రి ఎస్ ఈశ్వరన్ ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నారు. సింగపూర్ హైకోర్టు గత గురువారం ఆయనకి 12 నెలల జైలు శిక్ష విధించింది. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇద్దరు వ్యక్తుల నుంచి ఈశ్వరన్ గడించిన ఏడేండ్లలో 2.61 కోట్ల విలువైన బహుమతులు తీసుకున్నట్టు రుజువు కావడంతో కోర్టు ఈ శిక్ష విధించింది. బహుమతుల స్వీకరణకు సంబంధించిన 4 ఆరోపణలను, న్యాయస్థానాన్ని తప్పుదోవపట్టించడానికి సంబంధించిన మరో ఆరోపణను ఈశ్వరన్ గత నెల 24న అంగీకరించారు.సోమవారం నుంచి ఆయన జైలు జీవితాన్ని ప్రారంభించారు. ఈశ్వరన్ బహుమతులుగా స్వీకరించిన వైన్ బాటిల్స్, గోల్ఫ్ క్లబ్స్, బ్రాంప్టన్ సైకిల్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

భగ్గుమన్న సింగపూర్ ప్రజలు

కోర్టు విధించిన శిక్షను అనుభవించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, న్యాయస్థానం తీర్పును సవాల్ చేయబోనని ఆదివారం ఈశ్వరన్ తన ఫేస్‌బుక్ పోస్టులో రాసుకొచ్చారు. దీనిపై సింగపూర్ ప్రజలు భగ్గుమంటున్నారు. 1965లో సింగపూర్‌కు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఒక క్యాబినెట్ మంత్రి నేరస్తుడిగా శిక్ష అనుభవించడం ఇదే మొదటిసారని కామెంట్లు పెడుతున్నారు. మీ చర్యలతో భారత్, సింగపూర్ ప్రతిష్ఠ మసకబారిందన్నారు.

అమరావతి టూ మూసీ

అమరావతి నగరాభివృద్ధి బాధ్యతను చంద్రబాబు ప్రభుత్వం అప్పగించిన సెమ్‌కాప్ అండ్ అసెండర్స్ సింగ్‌బ్రిడ్జ్ కంపెనీ ఈశ్వరన్‌కు చెందినది కావడం గమనార్హం. అంతేకాదు, మూసీ ప్రాజెక్టు దక్కించుకొన్న మెయిన్‌హార్ట్‌లో కూడా ఈయనకు ప్రధాన వాటాలు ఉన్నాయి.

లోకం పోకడ



వామ్మో.. భయమేస్తున్నది సార్..
ఇక పిల్లి, ఎలుక, పాములకు బదులు
ఏమొస్తాయో ఏమో సార్!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.4°c	24.7°c
మెదక్	36.3°c	21.5°c
నిజామాబాద్	35.8°c	24.5°c
రంగారెడ్డి	35.6°c	20.0°c
మహబూబ్‌నగర్	33.4°c	22.1°c
ఖమ్మం	32.0°c	23.0°c
కరీంనగర్	32.0°c	24.0°c
హైదరాబాద్	31.0°c	22.0°c
వరంగల్	31.0°c	24.0°c
నల్లగొండ	30.0°c	23.6°c

రెండు రోజులు వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండ్రోజులపాటు వర్షాలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతం నుంచి లక్షద్వీప్ వరకూ ఒక ద్రోణి ఏర్పడిందని, లక్షద్వీప్ దగ్గర మరో అల్పపీడనం ఏర్పడే ఛాన్స్ ఉన్నదని చెప్పారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో వచ్చే రెండ్రోజులపాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు కూడా పడవచ్చునని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇక హైదరాబాద్ నగరంలో ఉదయం పొడి వాతావరణం, మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమవుతూ చిరుజల్లులు కురిసే వీలుంటుందని తెలిపారు.

నిరాధార ఆరోపణలతో పరువుకు భంగం

మొదటిపేజీ తరువాయి...

బిగ్‌బాస్ హోస్ట్‌గా, అన్నపూర్ణ స్టూడియో అధినేతగా కొనసాగుతున్న తనకు అభిమానుల నుంచి గుర్తుంపు లభించిందని, తెలుగు, హిందీ, తమిళ భాషల్లో 90కిపైగా చిత్రాల్లో నటించానని వివరించారు. తన తండ్రి అక్కినేని నాగేశ్వరరావు వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని తెలుగు సినీ పరిశ్రమలో అభిమానుల ఆదరణ పొందానని, సినీ రంగంలో తన విశేష కృషికి గుర్తింపుగా 9 నంది అవార్డులు, 3 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు లభించాయని చెప్పారు. 2017లో పెద్దల అంగీకారంతో నాగచైతన్య-సమంత వివాహం జరిగిందని, తెలుగుతోపాటు పలు ఇతర భాషల్లో కథానాయికగా నటించి సమంత మంచి గుర్తింపు తెచ్చుకున్నదని తెలిపారు. నాగచైతన్య-సమంతల మధ్య తలెత్తిన వివాదాల వల్ల వారిద్దరూ సొంత నిర్ణయం మేరకు 2021లో ఇష్టపూర్వకంగానే విడాకులు పొందారని, అనంతరం వారిద్దరు వేర్వేరుగా గౌరవప్రదంగా జీవిస్తున్నారని కోర్టుకు వివరించారు. నిరాధార ఆరోపణల వల్ల వారి వ్యక్తిగత జీవితాలపై దుష్ప్రభావం పడే అవకాశమున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు అక్కినేని కుటుంబం పరువుకు భంగం కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఆమె వ్యాఖ్యలు పలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతోపాటు పత్రికల్లోనూ వార్తలు వచ్చాయని వివరించారు. అనంతరం ఆ వ్యాఖ్యలకు సంబంధించిన వార్తల క్లిప్పింగులు, పెన్‌డ్రైవ్‌లను మెజిస్ట్రేట్‌కు చూపించారు. ఎన్-కన్వెన్షన్ హాల్‌కు, నాగచైతన్య-సమంత విడాకులకు ఎలాంటి సంబంధం లేదని నాగార్జున స్పష్టం చేశారు.

యార్లగడ్డ సుప్రియ వాంగ్మూలం ఇదీ..

నాగచైతన్య-సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతో అభిమానులు, స్నేహితులు, కుటుంబసభ్యులు తనకు ఫోన్లు చేశారని నాగార్జున కోడలు యార్లగడ్డ సుప్రియ కోర్టుకు వివరించారు. తన మామపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు అక్కినేని కుటుంబాన్ని తీవ్రంగా బాధించాయని, ఆ వ్యాఖ్యలు తమ కుటుంబం పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం మంత్రి సురేఖ మీడియా ఎదుట చేసిన వ్యాఖ్యలను చదివి కోర్టుకు వినిపించారు. నాగచైతన్య-సమంత విడాకులపై మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యల్లో ఏమాత్రం వాస్తవం లేదని, వారిద్దరు పరస్పర అంగీకారంతో ఇష్టపూర్వకంగానే విడాకులు తీసుకున్నారని వివరించారు. సమంత కూడా పేరున్న నటిగా సమాజంలో చలామణి అవుతున్నారని, రాజకీయ లబ్ధి కోసమే అక్కినేని కుటుంబంపై మంత్రి సురేఖ నిందారోపణలు చేశారని కోర్టుకు స్పష్టం చేశారు.

2 లక్షల్లోపు రుణమున్నా నాకు మాఫీ కాలే

గాంధీభవన్‌లో మంత్రి తుమ్మల ముందే కార్యకర్త కుండబద్దలు

రాజాపేట, అక్టోబర్ 8: 'నేను కాంగ్రెస్ పార్టీలో సీనియర్ కార్యకర్తను. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌రెడ్డికి ఎన్నికల ఏజెంట్‌గా పనిచేసిన. రాష్ట్రంలో మా ప్రభుత్వం చేసిన పంట రుణాలు సగం మంది రైతులకే మాఫీ అయ్యాయి. అందుకు నేనే ఉదాహరణ. నాకు బ్యాంకులో రూ.2 లక్షల లోపు పంట రుణం ఉంది. అయినా మాఫీ కాలేదు. నా లాంటి వాడికే రుణం మాఫీ కాకపోతే.. ఇక సామాన్య రైతుల పరిస్థితి ఏమిటి?' అంటూ యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని నెమిలెకు చెందిన కల్లూరి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమక్షంలో జరిగిన రుణమాఫీ సమావేశంలో ఆయన పాల్గొని సొంత పార్టీ సర్కారుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంట్లో ఇద్దరు రుణం తీసుకుంటే రుణమాఫీ వర్తించదని ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ప్రకటించకుండా రైతులను మోసం చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సర్కారు తీరు 'ఓడ ఎక్కాక ఓడ మల్లయ్య.. ఓడ దిగాక బోడ మల్లయ్య' చందంగా ఉందని విమర్శించారు. తాను నమ్మిన కాంగ్రెస్ ప్రభుత్వం తనతో పాటు ఎంతోమంది రైతులకు అన్యాయం చేసిందని, రుణమాఫీని ఎగ్గొట్టడానికే జాప్యం చేస్తున్నదని మంత్రి ఎదుటే కుండబద్దలు కొట్టారు. వెంటనే రుణమాఫీ చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పక పార్టీకి వ్యతిరేకంగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థులను ఓడిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు మల్లారెడ్డి ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ సోషల్ మీడియాలో మంగళవారం వైరల్ అయ్యింది.

మరో రైతు ఆత్మహత్య

కామారెడ్డి జిల్లా ఆత్మకూరులో విషాదం

కిష్టయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 8: అప్పులు బాధ తో ఓ రైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లాలో నాగిరెడ్డిపేట మండలం ఆత్మకూరుకు చెందిన నాయికోటి కిష్టయ్య (55) రైతు. పొలం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో కోళ్లఫారాన్ని ఆర్నెళ్ల క్రితం లీజుకు తీసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు పెరుగడంతో మానసికంగా కుంగిపోయాడు. సోమవారం రాత్రి కోళ్ల ఫారంలో నిద్రించడానికి వెళ్లిన కిష్టయ్య మంగళవారం ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, స్థానికులు కలిసి వెతకగా పెద్ద ఆత్మకూర్ శివారులో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మూసీకి నిధులు.. చైనా బ్యాంకు నుంచే?

- ఫిబ్రవరి 1న సచివాలయంలో భేటీ
- మూసీ ప్రాజెక్టుకు సాయం చేయాలంటూ సీఎం అభ్యర్థన
- సరేనన్న న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్ పాండ్యన్
- భేటీని ఏర్పాటు చేసింది ఏపీ సీఎం చంద్రబాబు మిత్రుడు ఈశ్వరన్
- పాండ్యన్‌కు ఈశ్వరన్ సన్నిహితుడు!
- ఏపీలోని అమరావతికి కూడా ఈ బ్యాంకుదే సహకారం!

జూలై 26న ఏపీ సీఎం చంద్రబాబుతో ఎన్డీబీ డైరెక్టర్ జనరల్ పాండ్యన్ భేటీ

ఫిబ్రవరి 1న రేవంత్‌రెడ్డితో ఎన్డీబీ డైరెక్టర్ జనరల్ పాండ్యన్ భేటీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): దేశంలోకి ఉగ్రవాదులను ఎగదోస్తూ పక్కలో బల్లెంలా పాకిస్థాన్ మారింది. సరిహద్దు కయ్యాలతో డ్రాగన్ దేశం చైనా తరుచూ భారత్‌పై తన విషాన్ని చిమ్ముతున్నది. దేశ అస్తిత్వానికే ముప్పుగా మారిన ఈ రెండు దేశాలతో సీఎం రేవంత్ సర్కారు తీసుకొచ్చిన 'మూసీ రివర్ ఫ్రంట్' ప్రాజెక్టు ముడిపడి ఉండటం సర్వత్రా చర్చనీయాంశమవుతున్నది. పాకిస్థాన్‌లో పలు కుంభకోణాలకు పాల్పడిన మెయిన్‌హార్ట్ కంపెనీకి 'మూసీ రివర్ ఫ్రంట్' అభివృద్ధి పనులను కట్టబెట్టగా, ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే నిధుల్లో మెజార్టీ డబ్బులను చైనా కేంద్రంగా పనిచేస్తున్న న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు సమకూర్చనున్నట్టు తేలడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

సీఎం విజ్ఞప్తితో సమ్మతి

న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్డీబీ) డైరెక్టర్ జనరల్ పాండ్యన్‌ను సీఎం రేవంత్ రెడ్డి గత ఫిబ్రవరి 1న రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మూసీ పునరుద్ధరణ పనుల్ని చేపట్టబోతున్నామని, మూసీ పరీవాహక ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని బ్యాంకు ద్వారా అందించాలని పాండ్యన్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పాండ్యన్.. మూసీ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను సమకూరుస్తామని హామీనిచ్చారు. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశమున్నట్టు సంబంధితవర్గాలు తెలిపాయి. అలా చైనా కేంద్రంగా కార్యకలాపాలు జరుపుతున్న ఓ బ్యాంకు మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగమౌతున్నట్టు అర్థమవుతున్నది.

ఎవరీ పాండ్యన్??

ఏపీ సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్ తమిళనాడుకు చెందినవారు. అంతేకాదు, ఆయన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు డైరెక్టర్ జనరల్ పాండ్యన్‌కు మంచి మిత్రుడిగా చెప్తారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ఆర్థిక వనరులు సమకూర్చడంలో ఈశ్వరన్ కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. అంతేకాదు.. ఏపీ రాజధాని అమరావతి నగరాభివృద్ధికి కూడా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు అండదండలు అందించనున్నట్టు కూడా వార్తలు వస్తున్నాయి. దీన్ని ధ్రువపరుస్తూ.. గత జూలై 26న ఏపీ సీఎం చంద్రబాబు పాండ్యన్‌తో సమావేశమవ్వడం, అనంతరం అమరావతి అభివృద్ధి గురించి మాట్లాడటం గమనార్హం.

బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసినా..

బ్రిక్స్ కూటమి దేశాలైన బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలో ప్రభుత్వాలు లేదా ప్రైవేటు కంపెనీలు చేపట్టే పలు ప్రాజెక్టులకు ఆర్థిక సాయాన్ని సమకూర్చే లక్ష్యంతో 2014లో బ్రిక్స్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఏర్పడింది. అయితే, కూటమిలోని దేశాలపై ఆధిపత్యం సాధించే ఉద్దేశంతో బ్యాంకు ప్రధాన కార్యాలయం తమ దేశంలోనే ఏర్పాటు చేయాలని, అలా అయితేనే బ్యాంకు ఏర్పాటుకు, ఆర్థిక సహకారానికి సాయమందిస్తామని చైనా మెలిక పెట్టింది. దీంతో సభ్య దేశాలు సరేనన్నాయి. అలా షాంఘైలో ఈ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం బ్రిక్స్ డెవలప్‌మెంట్ బ్యాంకు పేరును న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకుగా మారుస్తున్నట్టు చైనా ప్రకటించింది. ఇక, బ్యాంకులో బ్రిక్స్ కూటమిలోని ఒక్కో దేశం షేర్ వాటా 18.45 శాతానికి పరిమితంకాగా.. చైనా వాటా 26.2 శాతంగా ఉన్నది. దీనికోసం బంగ్లాదేశ్, అల్జీరియా, ఈజిప్ట్, యూఏఈ, ఉరుగ్వే తదితర దేశాలను బ్యాంకులో పరోక్ష భాగస్వాములుగా చైనా చేర్చింది. అలా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకుపై చైనా తన ఆధిపత్యాన్ని పెంచుకొన్నది.

మొదటి ర్యాంక్ వచ్చినా ఉద్యోగం లేదు!

- మెరిట్ ఉన్నా అర్హులు కాదని వెనక్కి!
- ఇన్‌సర్వీస్‌లో బీఈడీ చేస్తే ఉద్యోగం ఇవ్వరా
- డీఎస్సీ అభ్యర్థుల ఎంపికలో చిత్రవిచిత్రాలు
- విద్యాశాఖ అధికారులపై అభ్యర్థుల ఆగ్రహం

నారాయణపేటలో డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

ఉపాధ్యాయ ఉద్యోగ నియామకాల్లో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ డీఎస్సీ అభ్యర్థులు మంగళవారం నారాయణపేటలోని డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన డీఈవోను సస్పెండ్ చేయాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు.
– నారాయణపేట రూరల్

సిటీబ్యూరో, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఓ వైపు టీచర్ల నియామక పత్రాలు అందించబోతున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది.. మరోవైపు అదే నియామకాల ప్రక్రియలో మెరిట్ ఉన్నా ఉద్యోగాలు రాలేదని డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మొదటి ర్యాంకు సాధించినా అర్హులుకారని వెనక్కి పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బొళ్ల రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి నాన్ లోకల్ కింద ఎస్.ఏ సోషల్ తెలుగు మీడియంలో మొదటి ర్యాంకు సాధించాడు. అన్ రిజర్వ్‌డ్ పోస్టులో అతడికి కేటాయించాల్సిన ఉద్యోగాన్ని మరొకరికి కేటాయించారని హైదరాబాద్ విద్యాశాఖ అధికారి రోహిణికి దరఖాస్తు పెట్టుకున్నారు. ఇలా చాలా మంది తమకు అన్యాయం జరిగిందని డీఈవోకు దరఖాస్తుల రూపంలో మొరపెట్టుకున్నారు.

ఇన్‌సర్వీస్ తిప్పలు

హైదరాబాద్ జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు 616 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరికి బుధవారం ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేస్తారు. హైదరాబాద్‌లో 878 పోస్టులకుగాను 262 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో ఉంది. ఉర్దూ మీడియం రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థులు లేకపోవడంతో పోస్టులు పెండింగ్‌లో ఉంచినట్టు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఇన్‌సర్వీస్‌లో ఉండి సెలవులు పెట్టకుండానే బీఈడీ చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 8మంది అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో పడినట్టు తెలిసింది. దీంతో సదరు అభ్యర్థులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. పరీక్షల విభాగం ముందుగానే తమను నిరాకరించాల్సిందని.. పరీక్షకు అనుమతించి ర్యాంకు వచ్చాక ఇప్పుడు ఇన్‌సర్వీస్ అని ఇబ్బందులు సృష్టించడం సరైనది కాదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

1,056 టీచర్ పోస్టుల భర్తీకి బ్రేక్

కోర్టు కేసులతో నిలిచిన నియామక ప్రక్రియ

నేడు 10,006 మందికి ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబర్ 9 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ-24లో 1,056 టీచర్ పోస్టుల భర్తీకి బ్రేక్‌పడింది. కోర్టు కేసుల కారణంగా ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో 10,006 మంది టీచర్లకే బుధవారం నియామక ఉత్తర్వులివ్వనున్నారు. డీఎస్సీలో 11,062 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయగా, 1,056 పోస్టుల భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. కొత్త టీచర్లకు బుధవారం ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందజేయనున్నారు. జాబితాలను జిల్లాలకు పంపించగా, డీఈవోలు నియామక ఉత్తర్వులను తయారు చేసి బుధవారం హైదరాబాద్‌కు తీసుకురానున్నారు. ఎల్బీస్టేడియంలో సీఎం కొందరికే నియామక పత్రాలివ్వనుండగా, మిగతా వారికి జిల్లాలవారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి అధికారులే పత్రాలను అందజేయనున్నారు.